క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

జగిత్యాలటౌన్: ఒకటో తేదీన వేతనాలు జమ కావడంతో హర్షం వ్యక్తం చేస్తూ నాలుగోతరగతి ఉద్యోగులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జీతాలు రాక అనేక ఇబ్బందులు పడ్డామని తెలిపారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు ఒకటో తేదీనే జీతాలు జమచేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముజాహిద్ ఖాన్, జిల్లా కార్యదర్శి ఎల్లా వేణు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్


ఇబ్రహీంపట్నం: వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మండలంలోని ఎర్దండిలో మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే వెంటనే మా దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలు సీసీరోడ్ల నిర్మాణానికి మంజూరు కాగా, పనులు చేసేందుకు తీర్మానం చేశారు. గ్రామంలో హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు కాగా భవనం నిర్మించేందుకు స్థలం పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మనోజ్, కారోబార్ రతన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మేడిపల్లి-వేములవాడ బస్సు ప్రారంభం


బస్సు వద్ద మోత్కురావుపేట గ్రామస్తులు

మేడిపల్లి: మేడిపల్లి వాసుల చిరకాల స్వప్నం నెరవేరనుంది. వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడ్డ మండల వాసులకు ఆ సమస్య తీరనుంది. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మంగళవారం మేడిపల్లి-వేములవాడ బస్సు ప్రారంభమైంది. మేడిపల్లి నుంచి మోత్కురావుపేట చందుర్తి మీదుగా వేములవాడ చేరుకుంటుంది. బస్సు ప్రారంభంతో ప్రయాణికులకు సుమారు 25 కిలోమీటర్ల దూరభారం తగ్గనుంది.

కొనసాగుతున్న కాల్వ సర్వే


సర్వే చేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

సారంగాపూర్: మండల కేంద్రం శివారుల్లోని చింతల చెరువులోకి ఎస్సారెస్పీ నీటిని మళ్లించడానికి మంగళవారం లక్ష్మీదేవిపల్లి అటవీప్రాంతం సమీపంలో అధికారులు సర్వే చేపట్టారు. పెంబట్ల పెద్దమ్మ ఆలయం వద్ద డీ-53 ప్రధాన కాలువ నుంచి లక్ష్మీదేవిపల్లి మీదుగా, సారంగాపూర్ చింతల చెరువులోకి ఎస్సారెస్పీ నీటిని మళ్లించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా దీనిపై ఎస్సారెస్పీ ఈఈ నారాయణరెడ్డి, డీఈ చక్రూనాయక్‌ల ఆధ్వర్యంలో సర్వే పనులు సాగుతున్నాయి. మొత్తం 4 కిలోమీటర్లు కాల్వ గ్రావిటీ నీరు చేరుతుందని అధికారులు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: 2024-25 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి నీరజ తెలిపారు. అర్హత కలిగిన గిరిజన విద్యార్థులకు వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయినిపల్లి, ఆదిలాబాద్‌లోని స్పోర్ట్స్ పాఠశాల, ఊట్నూరు బాలుర పాఠశాల, కిన్నెరసాని, మహబూబ్‌నగర్ కొత్తగూడెం పాఠశాల, 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు 9059175379 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తాగు,సాగునీటిపై శ్రద్ధ వహించాలి

• జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: ప్రజలు, రైతులు తాగు, సాగునీరుపై ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు. ఏప్రిల్ 10వ తేదీ వరకు రైతుల పంటలు ఎండిపోకుండా ఉండేందుకు నీటిని విడుదల చేసేందుకు సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భూపతిపూర్ సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు ముత్యం రెడ్డి మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం కింద లబ్ధిదారుల లిస్టు గ్రామపంచాయతీల్లో అతికించాలని ట్రాన్స్‌కో ఏఈ అర్జున్‌ను కోరారు. ఎస్సారెస్పీ నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే పంటలకు నీటిని అందించాలని సింగిల్‌విండో చైర్మన్లు ఏనుగు మల్లారెడ్డి, ముత్యంరెడ్డి కోరారు. జెడ్పీటీసీ జాదవ్ అశ్విని మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు చేసిన పనులకు త్వరగా బిల్లులు వచ్చేలా చూడాలని పీఆర్ ఏఈ ప్రసాద్‌కు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, రైతులు తాగునీరు, సాగునీటిపై ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు దృష్టి సారించాలని, ఎస్సారెస్పీ జోన్-1లో ఏప్రిల్10 వరకు కెనాల్ ద్వారా నీటిని సరఫరా చేయాలని తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. మిషన్ భగీరథ పథకంలో నూతన ట్యాంకులు నిర్మాణం చేపట్టామని, మిషన్ భగీరథ క్లోరినేషన్ విషయంలో సీనియర్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడటం తగదనానరు. సమావేశంలో తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీవో సుష్మా, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సారంగాపూర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని తక్షణమే అమలు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో నల్లపోచమ్మ ఆలయం వద్ద రూ. 1.50 లక్షలతో బోరు, పంపు మంజూరు చేయడంతో మంగళవారం గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో మహాలక్ష్మీ పథకం కింద ప్రతి నెల అర్హులైన మహిళలకు రూ.2500 అందించాలన్నారు. దళితులు, గిరిజనులకు అంబేడ్కర్ అభయహస్తం ద్వారా రూ. 12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందని దీనిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి

• కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లిరూరల్: పాఠశాలల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం మెట్‌పల్లి మండలం వెల్లుల,జగ్గాసాగర్,ఆత్మకూర్,మెట్లచిట్టాపూర్,విట్టంపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను,బోధన తీరును తెలుసుకున్న ఆయన ఏమైనా ఇబ్బందులు,సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.అలాగే పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ సాయిరెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

గృహజ్యోతి పథకంతో పేదలకు లబ్ధి


జీరో బిల్లు అందిస్తున్న అధికారులు, నాయకులు

మల్లాపూర్ : గృహజ్యోతి పథకంతో పేదలకు లబ్ధి చేకూరుతుందని ట్రాన్స్‌కో ఏఈ వీనిత్‌రెడ్డి అన్నారు.మండల కేంద్రంతో పాటు వేంపల్లిలో మంగళవారం గృహజ్యోతి పథకాన్ని ట్రాన్స్‌కో అధికారులు ప్రారంభించి లబ్ధిదారుల ఇంట్లో మీటర్ రీడింగ్ తీసి వారికి జీరో బిల్లు అందజేశారు. ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్‌ఎల్‌ఐ దేవేందర్, సబ్ ఇంజనీర్ రమేష్, కాంగ్రెస్ నాయకులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, మిట్టపెల్లి జలపతిరెడ్డి, లైన్‌మెన్లు, జేఎల్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

మేడిపల్లిలో..

మెట్‌పల్లిరూరల్:మండలంలోని మేడిపల్లిలో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళవారం 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన వారికి ఎంపీటీసీ నగేశ్ జీరో బిల్లు రశీదును అందజేశారు.కార్యక్రమంలో మల్లికార్జున్, రాజేశ్,విష్ణు,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్: గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వెల్గటూర్‌లో గృహజ్యోతి పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన వినియోగదారులందరికీ గృహజ్యోతి పథకం వర్తిస్తుందని, అర్హులైన వారికి ఎవరికైనా ఈ పథకం అందకుంటే ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజాపాలన సహాయ కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


సూపర్‌వైజర్లను సన్మానిస్తున్న చైర్‌పర్సన్

ధర్మపురి: మహిళలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అన్నారు. ధర్మపురిలోని పాత హరిజన వాడ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి చైర్‌పర్సన్ హాజరై తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లను సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం 10,1098, 104,108 అత్యవసర సేవలకు 112 లకు డయల్ చేసి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కుసుమ, అంగన్‌వాడీలు మాధవీలత, ఆకుల లక్ష్మి పాల్గొన్నారు.

కేజీబీవీలో మహిళా దినోత్సవం

పెగడపల్లి: బాలికలు అన్ని రంగాల్లో రాణించి ప్రతిభ చాటాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర అన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్, రంగోలీ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బాలికల విద్యాభివృద్ధి కోసం, మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేసి వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక అధికారి సునీత, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మహిళల హక్కులపై అవగాహన పెంచుకోవాలి

మల్యాల: రాజ్యాంగంలో మహిళలకు పొందుపర్చిన హక్కులపై మహిళల అవగాహన పెంపొందించుకోవాలని సీడీపీవో నర్సింగరాణి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-8లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఉండే హక్కులపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం హెల్ప్‌లైన్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజశ్రీ, టీచర్ కస్తూరి కళావతి, మహిళలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి

జగిత్యాలరూరల్: మోడల్‌స్కూళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మోడల్‌స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్‌టీఏ) ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించేలా మోడల్‌స్కూల్ ఉద్యోగులను తీసుకురావాలని, వెంటనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టీఎంఎస్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంతం నగేశ్, జిల్లా బాధ్యులు ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రతకు సహకరించాలని వినతి

జగిత్యాలటౌన్: రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖలో (ఐసీడీఎస్) మిషన్ వాత్సల్యలో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కనీస వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పీఆర్సీ అమలు తదితర అంశాలు అమలయ్యేలా చూడాలని ఎమ్మెల్సీని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం ప్రతినిధి కరుణశ్రీ, హరీష్, శ్రీవాణి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్వరాభిషేకానికి ఆహ్వానం

జగిత్యాలటౌన్: శివగాన స్వరాభిషేకంలో పాల్గొనేందుకు రావాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని గాయకుడు నక్క రాజు ఆహ్వానించారు. మహాశివరాత్రి సందర్భంగా సాయిబాబా ఆలయంలో ఈనెల 8 న నిర్వహించే మహాధ్భుడ శివగాన స్వరాభిషేకానికి హాజరు కావాలని కోరారు.

ఆహ్వానపత్రిక అందజేత

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాసలో శ్రీ పొలాస్తేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 8 నుంచి జరిగే మహాశివరాత్రి జాతరకు రావాలని మంగళవారం ఈవో వేణుగోపాల్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

బీఆర్ఎస్‌కు పలువురి రాజీనామా

జగిత్యాల: పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ జీఆర్.దేశాయి, సతీశ్‌రాజు, గంగాధర్, వెంకటేశ్వర్లు, రవి, కిషన్‌గౌడ్, సత్యనారాయణ మంగళవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్నామని, న్యాయం జరగడం లేదని, పనిచేయని వారికి పెద్దపీట వేస్తున్నారని, అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నామని నాయకులు ప్రకటించారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు

ఇబ్రహీంపట్నం: పదో తరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి జరగనుండటంతో ప్రశ్నపత్రాలు మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు ప్రత్యేక వాహనంలో మధ్య చేరుకున్నాయి. పదో తరగతి 2వ సెట్ ప్రశ్న పత్రాలు రావడంతో ఈ ప్రశ్న పత్రాలను ప్రత్యేక బాక్సుల్లో పెట్టి సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. కార్యక్రమంలో రూట్ ఆఫీసర్, ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు, కస్టోడియన్ అధికారి బండారి మధు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక విధానంపై రైతులకు అవగాహన

ఇబ్రహీంపట్నం: జిల్లాలోని రైతులకు ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన కల్పించేందుకు జిల్లాలో 4 రైతు వేదికలను ఎంపిక చేసినట్లు మండల వ్యవసాయ అధికారి దీపిక మంగళవారం తెలిపారు. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మల్యాల, గొల్లపల్లి, సారంగపూర్ మండలాలను ఎంపిక చేశారు. ఈ మండలాల్లోని రైతు వేదికల్లో టీవీలు అమర్చి, ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించారు. ఈ నెల 6న ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్స్‌లను హైదరాబాద్‌లో ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. ఇబ్రహీంపట్నం రైతు వేదికలో బుధవారం ఉదయం 11 గంటలకు వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సింగిల్ విండో చైర్మన్లు, సీఈవోలు, రైతులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నీటి సమస్య తీర్చండి

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో 8, 9 వార్డుల్లో ఇళ్లకు మిషన్ భగీరథ నీళ్ల వారం రోజులుగా రావడంలేదని గ్రామస్తులు తెలిపారు. ఈ వార్డుల సమీపంలోనే వాటర్ ట్యాంక్ ఉన్నప్పటికీ అందులోకి మిషన్ భగీరథ నీళ్ల రావడం లేదన్నారు.అధికారులు చొరవ చూపి నీటి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

మురికికాలువలో చెత్త తీసి నిరసన

రాయికల్: పట్టణంలో నెలరోజుల నుంచి పారిశుధ్య సిబ్బంది కొరతతో మురికికాలువల్లో చెత్తచెదారం పేరుకుపోవడంతో దుర్వాసనతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని కో-ఆప్షన్ మెంబర్ సోహెల్ మంగళవారం మురికికాలువలో చెత్త తీసి నిరసన వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి

రాయికల్: పట్టణంలోని ఎనిమిదో వార్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించాలని కోరుతూ కౌన్సిలర్ కల్లెడ సునీత తో పాటు కాలనీవాసులు కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ ను కలిసి వినతి పత్రం అందజేశారు.

మండల సర్వసభ్య సమావేశం

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఎంపీపీ కాటిపెల్లి సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి తెలిపారు.

పీఆర్సీ అమలు చేయాలి

మెట్‌పల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం 51శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్సీని అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గాదె నర్సింగరావు కోరారు. పట్టణంలో మంగళవారం మాట్లాడారు. మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి కారుణ్య నియామకం ఇచ్చే వరకు కనీస వేతనం చెల్లించాలన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్‌ను 180 రోజులకు పెంచాలన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలను వాయిదా విధానంలో కాకుండా ఒకేసారి చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రతి నెలా సక్రమంగా వేతనాలు అందించడంలో పాటు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కుటుంబ వ్యవస్థతోనే దేశానికి గుర్తింపు

జగిత్యాలరూరల్: కుటుంబ వ్యవస్థతోనే దేశానికి గుర్తింపు వచ్చిందని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. మంగళవారం జగిత్యాలరూరల్ మండలం పొరండ్ల భీమేశ్వరస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచ దేశాల్లో మనలాంటి కుటుంబ వ్యవస్థ ఎక్కడా లేదని, అందుకే మన దేశ సంస్కృతి సంప్రదాయాల వైపు మొగ్గు చూపుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు లచ్చన్న, జిల్లా అధ్యక్షుడు చిట్ల గంగాధర్, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి సోమిరెడ్డి భూమరెడ్డి, గీతాఆశ్రమ నిర్వాహకులు రాజిరెడ్డి, అశోక్‌రావు, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

మెట్‌పల్లిరూరల్: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కేసీఆర్‌తండాలో మంగళవారం చోటు చేసుకుంది. మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుగ్లావత్ లక్ష్మి(31)ని గతంలో భాస్కర్ అనే వ్యక్తి వేధింపులకు గురిచేశాడు. దీంతో లక్ష్మి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టగా కేసు నమోదైంది. అప్పటినుంచి కక్ష పెంచుకున్న భాస్కర్ మంగళవారం లక్ష్మి వ్యవసాయ పనులకు వెళ్తుండగా మరో ఇద్దరితో కలిసి దూషించి, దాడికి పాల్పడ్డారు. దాడి విషయాన్ని రోదిస్తూ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు తెలిపింది. తర్వాత గదిలోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త మహిపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మెట్‌పల్లి: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కోదండం నవీన్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి మంగళవారం తెలిపారు.

సైబర్ మోసంపై కేసు నమోదు

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన రాంపల్లి శ్యాంకుమార్ అనే వ్యక్తిని మోసం చేసిన వ్యవహారంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ఇప్పించడం కోసం గుర్తు తెలియని వ్యక్తులు శ్యాంకుమార్‌ను నమ్మబలికి ఆన్‌లైన్‌లో రూ.32,500లను తీసుకొని మోసం చేశారు. దీనిపై అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడిపై కేసు

రాయికల్: పట్టణంలోని ఎల్మ గణేష్ అనే యువకుడు పై కేసు నమోదు చెసిన్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు. మంగళవారం పట్టణంలో తన ద్విచక్ర వాహనం పై అజాగ్రత్తగా వేగంగా నడిపినందుకు కేసు నమోదు చెసిన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

11న తైబజారు వేలం

కోరుట్ల: పట్టణంలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఈ నెల 11వ తేదీన తైబజారు బహిరంగ వేలం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు మున్సిపల్ కమిషనర్ పేరుమీద రూ. 50 వేల సాల్వెన్సీ సర్టిఫికెట్, రూ. 2 లక్షలు లేదా రూ. 20 వేల డీడీ రూపంలో చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు. డీడీ ని 10 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

వృద్ధులను వేధిస్తే చర్యలు

జగిత్యాలక్రైం: వయో వృద్ధులను వేధిస్తే చర్యలు తప్పవని టౌన్ సీఐ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాల్‌ను సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్, గౌరవ సలహాదారుడు జీఆర్.దేశాయి, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలి

పెగడపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వోరుగంటి రమణారావు కోరారు. పెగడపల్లి బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కేసీఆర్ ప్రకటించడం హర్షనీయమని ఆయన గెలుపు కోసం ప్రతి ఒకరు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు.

ఆదర్శ పాఠశాలలో జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

ధర్మపురి: మండలంలోని మగ్గిడి ఆదర్శ పాఠశాలలో ఈనెల 7 జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ముత్యం బుచ్చన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని ఈనెల 9,10 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు పవర్ లిఫ్టింగ్ జిల్లా కార్యదర్శి తమ్మడి రాజేందర్ 9177686447 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలి

మెట్‌పల్లి: ప్రభుత్వ పథకాలను అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజీత్‌రావు అన్నారు. మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మోహన్ మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ అందేలా చూడాలని కమిషనర్‌ను కోరారు.

రైతు బిడ్డకు డాక్టరేట్

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ గ్రామానికి చెందిన కొలగాని నరేశ్‌కు ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ సంస్థ, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ విభాగంలో డాక్టరేట్‌ను ప్రకటించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో జీహెచ్‌ఆర్టీ చైర్మన్ హెచ్‌ఆర్ రెహమాన్, తెలంగాణ రీజినల్ కో ఆర్డినేటర్ సీమా, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. నరేశ్‌కు డాక్టరేట్‌కు రావడంతో కుటుంసభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముత్యం రాజురెడ్డికి..

రాయికల్: పట్టణానికి చెందిన ఎద్దండి ముత్యపు రాజు రెడ్డి మంగళవారం హైదరాబాద్ లో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఏషియన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ వారు ×ఆర్గనైజేషనల్ లీడర్షిప్ విభాగంలో రాజురెడ్డి కి డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలవురు అభినందించారు.

దరఖాస్తు చేసుకోవాలి

రాయికల్: గృహజ్యోతి,మహాలక్ష్మి పథకంలో లబ్ధిపొందని వినియోగదారులు వెంటనే మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. రేషన్ కార్డు, ప్రజాపాలన దరఖాస్తు రసీదు, గ్యాస్ కలెక్షన్ బుక్కు, కరెంట్ బిల్లు దరఖాస్తులు నమోదు చేసిన మొబైల్ తీసుకుని ప్రజా పాలన సేవాకేంద్రంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం

ధర్మపురి: పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైందని డిప్యూటి డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ముగింపు కార్యక్రమం సందర్భంగా ధర్మపురి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌ను జగిత్యాల డిపో మేనేజర్ సునీత సందర్శించి పోలియో చుక్కలపై వివరాల అడిగి తెలుసుకున్నారు. మూడు రోజుల్లో వంద శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థుల అవస్థలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఓ ఇంటర్ పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసే విద్యార్థులు నానా తంటాలుపడ్డట్లు తెలిసింది. చెవికి సంబంధించిన సమస్యలు ఉండటంతో ఇద్దరు ముగ్గురు విద్యార్థులు వినికిడి పరికరాలు పెట్టుకుని వచ్చారు. ఇన్విజిలేటర్లు బ్లూటూత్ పరీక్షలు కావొచ్చని వారిని కొద్దిసేపు సెంటర్‌లోకి అనుమతించకపోవడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం విద్యార్థులను లోపలికి పంపించడంతో సమయం వృథా అయిందని విద్యార్థులు వాపోయినట్లు తెలిసింది. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్, నోడల్ అధికారికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం

నేటినుంచి దుబ్బరాజన్న బ్రహ్మోత్సవాలు


దుబ్బరాజన్న ఆలయం

సారంగాపూర్: మండలంలోని దుబ్బరాజన్న బ్రహ్మోత్సవాలు బుధవారం సాయంత్రం ప్రారంభం కానున్నాయి. ఈనెల 11 వరకు అంగరంగవైభవంగా జరగనున్నాయి. కోరిన కోర్కెలు తీర్చే స్వామివారిని దర్శించుకునేందుకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈవో అనూష, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

రాజన్న ఉత్సవ కమిటీలో ఇద్దరికి చోటు

కథలాపూర్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాటు చేసిన కమిటీలో మండలానికి చెందిన పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజుకు స్థానం దక్కింది. ఈ మేరకు మంగళవారం దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ముస్తాబైన పొలాస్తేశ్వరస్వామి ఆలయం



జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస్తేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి జాతరకు ముస్తాబైంది. ఈనెల 8 నుంచే పెద్ద ఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి కల్యాణానికి వేదిక కూడా సిద్ధం చేశారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు వేయించారు.

మల్లికార్జునస్వామి అగ్నిగుండాలు

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో మంగళవారం మల్లికార్జునస్వామి అగ్నిగుండాలు భక్తులు ఘనంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చాలని భక్తులు అగ్నిగుండంలో నుంచి కాలినడకన వెళ్లారు. ఈ ఉత్సవాల్లో యాదవ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.